సాక్షి నిజామాబాద్

శనివారం | 7 | జూన్ | 2025



మానసిక ఒత్తిడికి..
మానసిక ఒత్తిడిని యోగాతో దూరం చేసుకోవచ్చని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి రాజశ్రీ అన్నారు.
- 10లో ▸



రండి.. సర్కార్ బడుల్లో..
విద్యార్థుల ప్రవేశాల కోసం ప్రైవేట్ బడులకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు విస్తృతమైన ప్రచారం చేపట్టాయి.
- 10లో ▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 38.2 /24.4
ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్

నిజామాబాద్ అర్బన్: బక్రీద్ వేడుకను పురస్కరించుకొని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ వేడుకను ఆధ్యాత్మిక వాతావరణంలో ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. అన్ని వర్గాల ప్రజలు సుఖఃసంతోషాలతో ఉండాలని, సౌభ్రాతృత్వం, సుహృద్భావ వాతావరణం వెల్లివిరియాలని కోరారు.

ఏరియా ఆస్పత్రిని సందర్శించిన కాయకల్ప బృందం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని కాయకల్ప అసెస్‌మెంట్ బృందం సభ్యులు శుక్రవారం సందర్శించారు. ఆస్పత్రి పరిశుభ్రత, రోగులకు అందిస్తున్న వైద్య సేవలను సభ్యులు వినయ్, మరియా, మెఘావత్ అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు ఎంత మంది ఓపీలు వస్తున్నారు. ఆస్పత్రిలో అందిస్తున్న సదుపాయాల వివరాలను సేకరించారు. ఆస్పత్రి పరిశుభ్రత, సదుపాయాలపై మార్కులు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. వారి వెంట ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ రవికుమార్, వైద్యులు అమృత్‌రాంరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో చదివించాలి

- రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి



వేల్పూర్: గ్రామాలలో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పచ్చలనడ్కుడ గ్రామంలో శుక్రవారం ఆయన బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అన్వేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు ఖర్చు చేస్తోందన్నారు. అందుకనుగుణంగా విద్యార్థుల సంఖ్యను పెంచి స్కూళ్లను బలోపేతం చేయాలన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో కంప్యూటర్‌తో కూడిన ఇంగ్లిష్ మీడియం విద్యాబోధనతోపాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలు ఉన్నాయన్నారు. అనంతరం ఉపాధ్యాయులు గ్రామంలో బడిబాట ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

నవీపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులను సద్వియోగం చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ కిరణ్‌కుమార్ సూచించారు. మండలంలోని జన్నెపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరయ్యారు. పెండింగ్ సమస్యలపై దరఖాస్తు చేసుకుంటే రెవెన్యూ బృందం వాటిని పరిష్కరిస్తుందని సూచించారు. దరఖాస్తుల స్వీకరణ, సమస్యలపై రెవెన్యూ అధికారులు కల్పిస్తున్న అవగాహనపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటరమణ, గిర్దావర్ నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వేయాలి

రుద్రూర్: భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వేయాలని, ఇది పంట దిగుబడి పెంచేందుకు, సాగు వ్యయం తగ్గించడానికి దోహదపడుతుందని వ్యవసాయ పరిశోధన కేంద్రం అధిపతి, కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ అంజయ్య పేర్కొన్నారు. మండలంలోని రాయకూర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. తక్కువ యూరియా వాడాలని, అవసరం మేరకు రసాయనాలను వినియోగించి నేల ఆరోగ్యం కాపాడాలన్నారు. కూనారం 1638, వరంగల్ సిద్ధి, డబ్ల్యూజీఎల్ 1119, రుద్రూరు నుంచి విడుదలైన ఆర్‌డీఆర్-1200, ఆర్‌డీఆర్-1162 రకాలు, రాజేంద్రనగర్ నుంచి విడుదలైన వరి వంగడాల గురించి వివరించారు. కార్యక్రమంలో మండల ఏవో సాయికృష్ణ, మండల వైద్యాధికారి సంతోష్ రెడ్డి, విండో చైర్మన్ సంగమేశ్వర రావ్, ఏఈవో వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



గుంభనంగా గులాబీలు

బీఆర్‌ఎస్ ఆవిర్భావం నుంచి ఆ పార్టీకి నిజామాబాద్ జిల్లా అండగా ఉంటూ ఉద్యమంలో మరింత ముందుకెళ్లేలా స్ఫూర్తి రగిలించింది. మోతె మట్టి ముడుపు నుంచి మొట్టమొదటి జిల్లా ప్రజాపరిషత్ గెలుపు అందించడం ద్వారా గులాబీ పార్టీ రాష్ట్ర సాధన వరకు వెనుదిరిగి చూసుకోకుండా అండగా నిలబడింది. అయితే, కవిత కేసీఆర్‌కు రాసిన లేఖ లీక్ వ్యవహారం తర్వాత ఆ పార్టీ శ్రేణుల్లో గందరగోళం నెలకొంది. అగ్రనాయకుల మధ్య ఆధిపత్య పోరు నెలకొందని కొంతమంది.. అలాంటిదేమీ లేదని మరికొంత మంది పేర్కొంటున్నారు.

- ఎమ్మెల్సీ కవిత జిల్లా పర్యటన సందర్భంగా ఫ్లెక్సీల ఏర్పాటు
- కేసీఆర్ ఫొటో తప్ప కనిపించని రాష్ట్ర, జిల్లా నాయకుల ఫొటోలు
- భారీగా ఫ్లెక్సీలు.. నామమాత్రంగా కార్యకర్తలు
- సోషల్ మీడియాలో కొందరి ప్రత్యక్ష.. మరికొందరి పరోక్ష యుద్ధం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఎమ్మెల్సీ, కేసీఆర్ కుమార్తె కవిత తన తండ్రికి రాసిన లేఖ విషయమై ఇప్పటికీ గందరగోళం సద్దుమణగలేదు. జిల్లాకు ప్రాతినిథ్యం వహిస్తున్న నాయకురాలిగా ఉన్న కవిత రాసిన లేఖ లీక్ వ్యవహారంపై ఏవిధంగా స్పందించాలో తెలియని శ్రేణులు మొదట్లో నిశ్శబ్దంగా ఉన్నప్పటికీ ఆ తరువాత కొందరు కార్యకర్తలు నిదానంగా సోషల్ మీడియాలో స్పందించడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో పలువురు కవిత అభిమానులు లేఖలోని అంశాలు వాస్తవాలేనంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రకటిస్తూ వచ్చారు. ఒక దశలో సోషల్ వార్ మాదిరిగా దూకుడుగా కవితకు అనుకూలంగా పోస్టులు పెట్టారు. అయితే బహిరంగంగా మాత్రం ఎక్కడా వ్యాఖ్యలు చేయలేదు. కాగా ఇందల్వాయి మాజీ ఎంపీపీ రమేశ్‌నాయక్ మాత్రం కవితకు మద్దతు తెలుపుతూ ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి మాట్లాడారు. ఉద్యమకాలం నుంచి పార్టీలో ఉంటూ ఉద్యమాల్లో పాల్గొన్న శ్రేణులు మాత్రం కవిత లేఖ విషయమై ఆమెకు మద్దతుగా నిలుస్తూ వచ్చారు. అయితే పార్టీ లైనప్ ఏవిధంగా ఉందో తెలియకపోవడంతో సైలెంట్‌గా ఉంటూ వస్తున్నారు. చివరకు మాజీ ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు సైతం సైలెన్స్ పాటిస్తూ వస్తున్నారు. అయితే మాజీ ప్రజాప్రతినిధుల ముఖ్య అనుచరుల్లో కొందరు కవితకు వ్యతిరేకంగా సైతం పోస్టులు పెడుతుండడం గమనార్హం.

కవిత పర్యటన నేపథ్యంలో..

కవిత గత రెండు రోజులుగా జిల్లాలో పర్యటిస్తున్నారు. ఆమె పర్యటన నేపథ్యంలో నిజామాబాద్ నగరంతోపాటు జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో ఆమె అభిమానులు భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. గత ఫిబ్రవరిలో కవిత జిల్లా పర్యటనకు వచ్చిన సమయంలో నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరైనప్పటికీ ఫ్లెక్సీలు మాత్రం పెట్టలేదు. ప్రస్తుతం మాత్రం ఫ్లెక్సీలు భారీగా ఏర్పాటు చేసినప్పటికీ శ్రేణుల హాజరు మాత్రం చాలా తక్కువగా ఉంది. పైగా ఫ్లెక్సీల్లో వేర్పాటువాదం స్పష్టంగా కనిపించింది. అన్ని ఫ్లెక్సీల్లో కేసీఆర్ ఫొటో మాత్రమే ఉంచారు. కేటీఆర్, హరీశ్‌రావు, సంతోష్‌రావుతోపాటు జిల్లాకు చెందిన ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, షకీల్, గణేశ్ గుప్తా, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు ఫొటోలు సైతం ఫ్లెక్సీల్లో పెట్టలేదు. కొన్ని ఫ్లెక్సీల్లో ఓ సీనియర్ కార్యకర్త ఫొటో కింద బీఆర్‌ఎస్ నాయకుడు అని ప్రింట్‌చేసినప్పటికీ ఆ తరువాత దానిపై పేపర్ అతికించడం గమనార్హం. కవిత తన పర్యటనలో భాగంగా వరుసగా గుడులను సందర్శిస్తున్నారు. అదేవిధంగా పలువురు కార్యకర్తల ఇళ్లకు వెళ్లి పలకరింపులు, పరామర్శలు చేస్తున్నారు. అయితే ఆమె పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గమనిస్తున్న కార్యకర్తలు దీనిని ఎలా అర్థం చేసుకోవాలో అర్థం కావడం లేదని పేర్కొంటున్నారు. ఈ పరిణామాలన్నింటి నేపథ్యంలో గులాబీ శ్రేణులు గుంభనంగా ఉన్నాయి.



కేసీఆర్ చిత్రం మినహా ఇతర నాయకుల ఫొటోలు లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ



బీఆర్‌ఎస్ నాయకుడు అని ఉన్న చోట పేపర్ అతికించిన దృశ్యం

క్షణికావేశానికి నిండు ప్రాణాలు బలి

- కామారెడ్డి జిల్లాలో కొడుకుతో కలిసి చెరువులో దూకిన తల్లి
- నిజామాబాద్‌లో దంపతుల ఆత్మహత్య



రుద్రేశ్వర్



స్రవంతి

క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం రెండు కుటుంబాలను ఛిన్నాభిన్నం చేసింది. ఉమ్మడి జిల్లాలో శుక్రవారం ఆత్మహత్య ఘటనలు కలకలం రేపాయి. కామారెడ్డి జిల్లా నర్సన్నపల్లిలో కుటుంబసభ్యుల మధ్య గొడవ జరగడంతో ఓ తల్లి.. కొడుకుతో కలిసి చెరువులో దూకి మరణించింది. నిజామాబాద్ నగరంలోని గాయత్రినగర్‌లో ఆర్థిక ఇబ్బందులతో దంపతులు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డారు.

కామారెడ్డి క్రైం: క్షణికావేశంలో ఓ తల్లి తీసుకున్న నిర్ణయం కుటుంబంలో విషాదాన్ని నింపింది. కుమారుడితో సహా తల్లి చెరువులో దూకడంతో ఇద్దరి ప్రాణాలు నీట మునిగాయి. నర్సన్నపల్లి గ్రామంలో చోటు చేసుకున్న విషాద ఘటన వివరాలిలా ఉన్నాయి. నర్సన్నపల్లి గ్రామానికి చెందిన రాచమొల్ల ప్రశాంత్‌కు భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన స్రవంతి(25)తో వివాహమైంది. వీరికి శ్రీవల్లి అనే కూతురు, రుద్రేశ్వర్(4) అనే కుమారుడు ఉన్నారు. కొన్నాళ్ల క్రితం స్రవంతి అత్తగారికి చెందిన బంగారాన్ని తల్లి గారి కుటుంబ సభ్యులకు ఇచ్చింది. వారు ఆ బంగారాన్ని తాకట్టు పెట్టి రుణం తీసుకున్నారు. నగలను తిరిగి ఇవ్వకపోవడంతో ఇటీవల ఇరు కుటుంబాల మధ్య గొడవలు జరిగినట్లు తెలిసింది. శుక్రవారం నగల విషయమై స్రవంతితో కుటుంబ సభ్యులు గొడవ పడ్డట్లు సమాచారం. కొద్దిసేపటి తర్వాత స్రవంతి తన ఇద్దరు పిల్లలను వెంట తీసుకుని ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. పక్కనే ఉన్న చిన్నమల్లారెడ్డి చెరువు కట్టకు వద్దకు చేరుకున్నారు. నీటిలో దూకడానికి కూతురు నిరాకరించడంతో స్రవంతి కుమారుడు రుద్రేశ్వర్‌తో కలిసి నీటిలో దూకి మరణించింది. దీనిని గమనించిన స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి ఇద్దరి మృతదేహాలను బయటికి తీయించారు. కుటుంబంలో జరిగిన గొడవల కారణంగానే స్రవంతి తన కొడుకుతో కలిసి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆమె తల్లి రాధమణెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని రూరల్ సీఐ రామన్ తెలిపారు.

దంపతుల ఆత్మహత్య

ఖలీల్‌వాడి : నగరంలోని గాయత్రినగర్ ప్రాంతంలో దంపతుల ఆత్మహత్య శుక్రవారం కలకలం రేపింది. పోలీసులు, స్థానికులు తెలిపిన కథనం ప్రకారం.. కోటగల్లికి చెందిన శ్రీనివాస్ (56), మమత (52)కు ఇద్దరు కుమారులు, ఒక కూతురు. శ్రీనివాస్ నగరంలోని ఓ ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేస్తుండేవాడు. ఇటీవల కోటగల్లిలోని సొంతింటిని విక్రయించారు. కూతురికి పెళ్లి చేయడంతోపాటు ఇద్దరు కుమారులను గల్ఫ్ దేశానికి పంపించారు. ప్రస్తుతం గాయత్రినగర్‌లో అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో వేర్వేరు గదుల్లో శ్రీనివాస్, మమత ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. సమాచారం అందుకున్న టౌన్ సీఐ శ్రీనివాస్ రాజ్, ఎస్సై శ్రీకాంత్ ఘటనా స్థలానికి చేరుకొని దంపతుల ఆత్మహత్యకు గల కారణాలను ఆరా తీశారు. కాగా, ఆర్థిక ఇబ్బందులతోనే భార్యాభర్తలు ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని స్థానికుల ద్వారా తెలిసింది.



మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు

రేవంత్‌వి డైవర్షన్ పాలిటిక్స్

- బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్ : ప్రజల దృష్టిని మరల్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో ఆరోపించారు. సీఎం కుర్చీ ఎక్కినా రేవంత్‌రెడ్డి బజారు భాష మరువడం లేదని, ఆయన ఆలేరు సభలో చేసిన వ్యాఖ్యలే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. కొత్తగా చేసే పనులు చెప్పడానికి ఏమీలేకనే అధికారంలోకి వచ్చి 18 నెలలు కావొస్తున్నా, ఇంకా కేసీఆర్ మీద పడి ఏడుస్తున్నారని, 70 ఏళ్ల వయస్సులో కేసీఆర్ అనుకోకుండా కాలుజారి పడితే, ఏవో పాపాలు చేస్తే దేవుడు శిక్షించినట్లుగా మాట్లాడటం రేవంత్ కుసంస్కారాన్ని సూచిస్తోందని విమర్శించారు.

'డబుల్' ఇళ్లను వెంటనే పంపిణీ చేయాలి

- లేదంటే ఆగస్టు 15న పేదలతో గృహ ప్రవేశం చేయిస్తాం
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి

సుభాష్‌నగర్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌కు సమీపంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను అర్హులకు వెంటనే పంపిణీ చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి డిమాండ్ చేశారు. లేదంటే ఆగస్టు 15న బీజేపీ ఆధ్వర్యంలో పేదలతో గృహప్రవేశం చేయిస్తామని హెచ్చరించారు. శుక్రవారం డబుల్ బెడ్రూం ఇళ్లను బీజేపీ నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా దినేశ్ పటేల్ మాట్లాడుతూ ప్రజాధనంతో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను ప్రభుత్వ వైఫల్యంతో నేటికీ పేదలకు అందించకపోవడం తీవ్ర ఆవేదన కలిగిస్తోందన్నారు. ఆ ఇళ్లు పేదల హక్కు అని, ఎవరి సొత్తు కాదని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో ప్రజలకు ఇవ్వకుండా మోసం చేయగా, ఇప్పుడు ఇందిరమ్మ కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. డబుల్ బెడ్రూం ఇళ్లపై రాజకీయాలు మానుకొని, వెంటనే అర్హులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రూరల్ కన్వీనర్ పద్మారెడ్డి, నాయకులు జగన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, మాస్టర్ శంకర్, ఆనంద్, నరేశ్, ఆమంద్ విజయ్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలిస్తున్న దినేశ్ పటేల్

నవోదయలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

- తాత్కాలిక భవన మరమ్మతులను వేగంగా చేపట్టాలి
- శాశ్వత భవనం అందుబాటులోకి వచ్చే వరకు డైట్ భవనంలోనే కొనసాగింపు
- అధికారులకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశం

నిజామాబాద్ అర్బన్: జిల్లాకు కొత్తగా మంజూరైన జవహర్ నవోదయ విద్యాలయంలో ఈ ఏడాది నుంచే తరగతులను నిర్వహించనున్న దృష్ట్యా మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని నాగారంలో ఉన్న జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్) కళాశాల ఆవరణలోని భవన సముదాయాలలో తాత్కాలికంగా జవహర్ నవోదయ విద్యాలయాన్ని నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ శుక్రవారం డైట్ కాలేజీ భవనాన్ని సందర్శించి, తరగతుల నిర్వహణకు అనువైన పరిస్థితులు, అందుబాటులో ఉన్న వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రస్తుత విద్యా సంవత్సరం ఆరో తరగతిలో ప్రవేశాలు చేపట్టి తరగతులను నిర్వహిస్తామని, రెండు సెక్షన్‌లలో 80 మంది విద్యార్థినీవిద్యార్థులు ప్రవేశం పొందుతారని కలెక్టర్ తెలిపారు. ఈ నేపథ్యంలో విద్యార్థులతోపాటు అధ్యాపకులు, సిబ్బందికి తగిన వసతి, బోధన తరగతుల నిర్వహణ వంటి వాటికి ఇబ్బందులు లేకుండా అవసరమైన సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. తరగతి గదులు, డార్మెటరీ, డైనింగ్ హాల్, లైబ్రరీ, బాలబాలికలకు వేర్వేరుగా హాస్టల్ భవనాలు, స్టాఫ్ క్వార్టర్స్ కోసం ఎంపిక చేసిన గదులను కలెక్టర్ పరిశీలించారు. తాత్కాలిక భవనాలలో కొనసాగుతున్న మరమ్మతు పనులను శరవేగంగా జరిపించాలని, నూతన విద్యా సంవత్సరం తరగతులు ప్రారంభమయ్యే నాటికి పనులను పూర్తి చేయించాలని సూచించారు. శాశ్వత భవనం అందుబాటులోకి వచ్చే వరకు జవహర్ నవోదయ విద్యాలయం డైట్ కళాశాల ప్రాంగణంలోని భవన సముదాయాల్లోనే కొనసాగనున్న దృష్ట్యా మరమ్మతు పనులు పక్కాగా జరిపించి అవసరమైన అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చొరవ చూపాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట డీఈవో పీ అశోక్, జవహర్ నవోదయ విద్యాలయం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ యోహన్నన్, పంచాయతీరాజ్ ఈఈ శంకర్ తదితరులున్నారు.



డైట్ భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

దాశరథిని ప్రభుత్వం విస్మరిస్తోంది

- ఆయన గొప్పతనాన్ని రేపటి తరాలకు తెలపాలి
- శత జయంతిని ప్రభుత్వం నిర్వహించాలి
- లేని పక్షంలో జాగృతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తాం
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

నిజామాబాద్‌అర్బన్: దాశరథి కృష్ణమాచార్య శతజయంతి ఉత్సవాలను ప్రభుత్వం నిర్వహించాలని, లేనిపక్షంలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో తామే నిర్వహిస్తామని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. జిల్లా కేంద్రంలోని ఖిల్లా జైలును ఆమె శుక్రవారం సందర్శించారు. అనంతరం రామాలయం ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణను సోయిలేని ప్రభుత్వం పాలిస్తోందని విమర్శించారు. నిజాం ఆకృత్యాలను ఎండగడుతూ ప్రజలని జాగృతం చేసిన దాశరథి జయంతి వేడుకలను నిర్వహించకపోవడం సరైంది కాదన్నారు. నిజామాబాద్‌లోని ఖిల్లా జైలులో దాశరథి 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని రాసి తెలంగాణ ప్రజలను చైతన్య పరిచారని గుర్తుచేశారు. ఆయన శిక్ష అనుభవించిన జైలును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో తమ ప్రభుత్వ హయాంలో నిధులు విడుదల చేశామన్నారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో రూ.40 కోట్లు విడుదల చేశానని గుర్తు చేశారు.





మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత, పక్కన నగర మాజీ మేయర్ నీతూకిరణ్, కవులు, జాగృతి నాయకులు

వాగ్దానాలను విస్మరించింది

ప్రభుత్వం వాగ్దానాలను విస్మరించిందని కవిత విమర్శించారు. వానాకాలం వచ్చినా ఇప్పటి వరకు ధాన్యం కొనుగోళ్లు పూర్తి కాకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారన్నారు. ధాన్యం సేకరణ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రేషన్ షాపుల్లో బియ్యం కోసం ప్రజలు గంటల తరబడి నిల్చుంటున్నా సమస్యకు పరిష్కారం చూపడం లేదన్నారు. సమావేశంలో మాజీ మేయర్ నీతు కిరణ్, జాగృతి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ రాజశ్రీ

నిజామాబాద్‌నాగారం: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారిణి రాజశ్రీ సంబంధిత అధికారులను ఆదేశించారు. కీటక జనిత వ్యాధుల నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో సీజనల్ వ్యాధుల నియంత్రణపై డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఆరోగ్య ఉపకేంద్ర, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో వివిధ శాఖల సమన్వయంతో సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి జ్వర సర్వే నిర్వహించి, అనుమానిత కేసులకు చికిత్స అందించాలన్నారు. నీటి నిల్వలను తొలగించేలా అధికారులకు సమాచారం అందించాలని, నీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయించాలన్నారు. పీహెచ్‌సీల పరిధిలో ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో, కీటక జనిత వ్యాధుల నియంత్రణ జిల్లా అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ మాట్లాడుతూ దోమల నియంత్రణపై దృష్టి పెట్టి దోమలు పుట్టకుండా జాగ్రత్త పడాలని తెలిపారు. సమావేశంలో ఎపిడమాలజిస్ట్ వెంకటేశ్, అసంక్రమిత వ్యాధుల నియంత్రణ అధికారి సామ్రాట్ యాదవ్, డీహెచ్‌ఈ ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు, గోవర్ధన్, వెంకట్ రవి, పీహెచ్‌సీల వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ రాజశ్రీ

క్లుప్తంగా

9న దోస్త్ ప్రత్యేక కేటగిరీ ధ్రువపత్రాల పరిశీలన

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో దోస్త్ ఆన్‌లైన్ డిగ్రీ ప్రవేశాలకు రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రత్యేక కేటగిరీ విద్యార్థులకు ఈ నెల 9న ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించనున్నట్లు దోస్త్ కోఆర్డినేటర్ వాసం చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక కేటగిరీ పీహెచ్‌సీ (దివ్యాంగులు), సీఏపీ, ఎన్‌సీసీ, స్పోర్ట్స్, ఎక్స్‌ట్రా కర్కిక్యులర్ అక్టివిటీస్ విద్యార్థులు అన్ని సర్టిఫికెట్లు, రెండు సెట్ల జిరాక్స్‌లతో తెయూ అడ్మిషన్స్ కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహిస్తారని తెలిపారు.

రండి.. సర్కార్ బడుల్లో చేరండి

- ప్రయివేటుకు దీటుగా ప్రభుత్వ ఉపాధ్యాయుల వినూత్న ప్రచారం
- ప్రవేశాల కోసం బ్రోచర్లు, ఫ్లెక్సీలను ప్రచురించి బడిబాట నిర్వహిస్తున్న వైనం



పాలెం ప్రాథమికోన్నత పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



హాసాకొత్తూర్ ఉన్నత పాఠశాలలో బ్రోచర్లు విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

మోర్తాడ్(బాల్కొండ): విద్యార్థుల ప్రవేశాల కోసం ప్రయివేటు బడులకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు విస్తృతమైన ప్రచారం చేపట్టాయి. అడ్మిషన్ల సంఖ్యను పెంచుకోవాలనే సంకల్పంతో జిల్లావ్యాప్తంగా బడిబాట కార్యక్రమంను శుక్రవారం ఆరంభించారు. అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులను ఆకట్టుకోవడానికి కృషి చేస్తున్నారు. కరపత్రాలు, ఫ్లెక్సీలను ముద్రించి కూడళ్లలో ప్రదర్శిస్తున్నారు. ఇంటింటికి వెళ్లి విద్యార్థుల పేర్లు నమోదు చేసుకుంటున్నారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి తీసుకుంటున్న కార్యక్రమాలను ఉపాధ్యాయులు వివరిస్తున్నారు. ఉచిత యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు, స్కాలర్‌షిప్‌లు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని వెల్లడిస్తున్నారు. గతంలో కంటే ఎక్కువ మంది విద్యార్థులను చేర్పించుకోవడానికి మహిళా సంఘాలు, గ్రామాభివృద్ధి కమిటీల మద్దతుతో ఉపాధ్యాయులు ఇంటింటి ప్రచారం కొనసాగిస్తున్నారు. ప్రయివేటు పాఠశాలల ప్రచారాన్ని తిప్పికొట్టేలా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు చేస్తున్న ప్రచారం అందరిని ఆకట్టుకుంటుంది.

రూ.20తో రెండు లక్షల ప్రమాద బీమా

మీకు తెలుసా?



ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై) కింద ఏడాదికి రూ.20 ప్రీమియం చెల్లించవచ్చు. బ్యాంకు ఖాతా కలిగిన 18–70 ఏళ్ల లోపు వయస్సుగల వారు అర్హులు. ఈబీమా ద్వారా ప్రమాదం వలన మరణం సంభవించినా, లేదా ప్రమాద కారణంగా రెండు కళ్లు, రెండు చేతులు, లేదా ఒక కంటి చూపు, చెయ్యి లేదా పాదం కోల్పోయిన రూ. రెండు లక్షల బీమా నామినీకి సొమ్ము చెల్లిస్తారు.

- ఒక కన్ను లేదా ఒక చెయ్యి, లేదా ఒక కాలు వీటిలో ఏదేని ఒకటి కోల్పోయిన రూ.లక్ష చెల్లిస్తారు.
- ప్రమాదం జరిగినట్టుగా పోలీసు ఎఫ్ఐఆర్, డాక్టర్ ధ్రువీకరణతో సులభంగానే సంబంధిత బ్యాంకు ద్వారా క్లెయిమ్ చేసి బీమా సొమ్ము పొందవచ్చు.

– కామారెడ్డి అర్బన్

త్యాగాల పండుగ బక్రీద్

- నేడు ఘనంగా నిర్వహించనున్న ఉమ్మడి జిల్లా ముస్లింలు
- ఈద్గాల వద్ద ఏర్పాట్లు పూర్తి

నిజామాబాద్ రూరల్/నిజామాబాద్ సిటీ/బిచ్కుంద(జుక్కల్): ముస్లింలు జరుపుకునే పండుగల్లో ప్రత్యేకమైనది బక్రీద్. ఈ పండుగను త్యాగానికి ప్రతీకగా జరుపుకుంటారు. నేడు (శనివారం) బక్రీద్ సందర్భంగా ముస్లింలు ఈద్గా, మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పండుగ కోసం ప్రత్యేక ఏర్పాట్లను అధికారులు, స్థానిక ముస్లిం కమిటీల ప్రతినిధులు ఇప్పటికే పూర్తిచేశారు. పండుగ సందర్భంగా ముస్లింలు ప్రార్థనల అనంతరం పొట్టేళ్లను ఖుర్బానీ ఇస్తారు. పొట్టేళ్ల మాంసాన్ని మూడు భాగాలుగా విభజించి ఒక భాగం ఇంటి కోసం, రెండో భాగం బంధువులకు, మూడోది నిరుపేదలకు పంపిణీ చేస్తారు.

బాల్కొండ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో..

బాల్కొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుటకు విద్యార్థులు కావలెను అంటూ అధ్యాపకులు గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. 2023–24 విద్యాసంవత్సరం మధ్యలోనే డిగ్రీ కళాశాలను ప్రారంభించగా, 2024–25 విద్యా సంవత్సరంలో 30 మంది విద్యార్థులతో కళాశాలను కొనసాగించారు.కళాశాలలో బీఏ, బీఎస్సీ, బీకాం కోర్సులుండగా, ప్రస్తుత విద్యా సంవత్సరమైన విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని అధ్యాపకులు ఆశిస్తున్నారు. విద్యార్థులు తక్కువగా ఉండటంతో డిగ్రీ పరీక్ష కేంద్రం ఆర్మూర్‌లోనే కేటాయించారు.

వసతులు లేకపోవడంతోనే..

బాల్కొండ మండల ప్రజలు డిగ్రీ కళాశాల కోసం కొన్నేళ్ల నుంచి ఎదురు చూడగా 2023లో అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. కానీ సొంత భవనం లేకపోవడంతో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని ఓ భవనంలో డిగ్రీ కళాశాలను నిర్వహిస్తున్నారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో రెగ్యులర్ ప్రిన్సిపాల్ కూడ లేడు. ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఇక్కడ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్నారు. కళాశాలలో కనీస వసతులు కూడ లేకపోవడంతో విద్యార్థులు ఇక్కడ చదువుకోవడానికి జంకుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి డిగ్రీ కళాశాలకు సొంత భవనం నిర్మించి, సౌకర్యాలు కల్పిస్తే విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



బాల్కొండ జూనియర్ కళాశాల ఆవరణలోని డిగ్రీ కళాశాల

విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం

ప్రవేశాల కోసం విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నాం. ప్రస్తుత విద్యా సంవత్సరం విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. సొంత భవనం కోసం అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. విద్యార్థుల సంఖ్య పెరిగితే పరీక్ష కేంద్రం కూడ ఇక్కడే అనుమతి లభిస్తుంది.

– వేణు ప్రసాద్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, బాల్కొండ

మానసిక ఒత్తిడికి యోగాతో పరిష్కారం





మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాజశ్రీ, యోగాసనాలు చేస్తున్న శిక్షకులు

నిజామాబాద్‌నాగారం: మానసిక ఒత్తిడిని యోగాతో దూరం చేసుకోవచ్చని డీఎంహెచ్‌వో రాజశ్రీ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని దశాబ్ది వేడుకల్లో భాగంగా నగరంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా అధికారులకు, ఉద్యోగులకు యోగాపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. డీఎంహెచ్‌వో ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. నిత్య జీవితంలో యోగా ప్రాముఖ్యతను వివరించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని 'హర్ దిన్ యోగా–హర్ ఘర్ యోగా' నినాదంతో ప్రతి ఇంటికి యోగాను తీసుకెళ్లాలని తెలిపారు. వేడుకల్లో ప్రజలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా ఆయుష్ నోడల్ అధికారి గంగదాస్, వైద్యులు తిరుపతి, వెంకటేష్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, డీపీఎం వందన, ఆయుష్ పారా మెడికల్ సిబ్బంది పురుషోత్తం, ఉమా ప్రసాద్, స్వాతి, రమేష్, భిక్షపతి, యోగా శిక్షకులు నమ్రత, సంగీత, విజయభాస్కర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌లో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలో శుక్రవారం పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈసందర్భంగా పోలీసులు ఇంటింటికీ వెళ్లి తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి ధ్రువ పత్రాలు లేని 48బైక్‌లు, 2 ఆటోలను సీజ్ చేశారు. అనంతరం ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. సీజ్ చేసిన వాహనాలకు సరైన పత్రాలను పోలీస్ స్టేషన్ తీసుకువచ్చి, వాహనాన్ని తీసుకువెళ్లవచ్చని ప్రజలకు సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. యువకులు మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దన్నారు. సీఐలు వెంకటనారాయణ, విజయ్‌బాబు, కృష్ణ, సబ్ డివిజన్ పరిధిలోని ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కానిస్టేబుల్ కుమారుడిపై మైనర్ డ్రైవింగ్ కేసు

ఖలీల్‌వాడి: నగరంలో ఓ కానిస్టేబుల్ కుమారుడు మైనర్ డ్రైవింగ్ చేయడంతో ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. నగరంలోని రైల్వేస్టేషన్ వద్ద శుక్రవారం ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఓ కానిస్టేబుల్‌కు ప్రభుత్వం కేటాయించిన బైక్‌ను అతడి కొడుకు (మైనర్) నడిపించడంతో ట్రాఫిక్ పోలీసులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసి, బైకును సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు.

ఇసుక వాహనం పట్టివేత

రుద్రూర్: కోటగిరి శివారు నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న టాటా వాహనాన్ని పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. వాహనాన్ని కోటగిరి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ షేక్ రఫిక్, వాహన యాజమాని షేక్ లతీఫ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సునీల్ తెలిపారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్టు

ఆర్మూర్‌టౌన్: ఆలూర్ మండల కేంద్రంలో పేకాట స్థావరంపై శుక్రవారం పోలీసులు దాడి చేసి, పేకాడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. అలాగే వారి నుంచి రూ. 10830 నగదు, ఐదు సెల్‌ఫోన్‌లు, మూడు వాహనాలను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.


యువకుడి అదృశ్యం

బోధన్: ఎడపల్లికి చెందిన గట్టుపల్లి సాయి కుమార్ (27) అనే వ్యక్తి అదృశ్యమైనట్లు ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డి శుక్రవారం తెలిపారు. సాయికుమార్‌కు సరైన ఉద్యోగం లభించక ఏడాదిగా ఇంట్లోనే ఉంటున్నాడు. దీంతో తీవ్ర మనస్తాపం చెంది ఈ నెల 4న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఇప్పటికీ తిరిగి రాకపోవడంతో అతడి భార్య ఆద్రిక పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

పిట్లం(జుక్కల్): మండలంలోని రాంపూర్ గ్రామంలో గురువారం సాయంత్రం ఓ గేదె విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. బాధితుడు తెలిపిన వివరాలు.. గ్రామంలోని రైతు ముందడి బలరాంరెడ్డికి చెందిన గేదె రోజులాగే గ్రామ శివారులో మేత మేసేందుకు వెళ్లింది. మేత మేస్తుండగా కింద పడిన విద్యుత్ తీగలను గేదె తాకడంతో విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మరణించింది. రూ. 50వేల విలువ గల గేదె మృతి చెందడంతో రైతు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు.

70 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



కామారెడ్డి క్రైం: డీసీఎం వ్యాన్‌లో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 70 క్వింటాళ్ల రేషన్ బియ్యంను కామారెడ్డి సీసీఎస్ పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇలా.. జిల్లా కేంద్రంలోని రాజీవ్ నగర్ కాలనీకి చెందిన ఓ వ్యక్తి 40 కిలోల చొప్పున రేషన్ బియ్యంను సంచులలో నింపి దాదాపు 180 బస్తాలను ఓ డీసీఎంలో తరలించేందుకు సిద్ధం చేశారు. వెంటనే సీసీఎస్ పోలీసులకు సమాచారం అందడంతో ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి, సీసీఎస్ పోలీసులు కలిసి డీసీఎంను, డ్రైవర్ అర్బాజ్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి వాటిని సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగిస్తామని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

మరో కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు

- విధులకు డుమ్మా.. ఆపై డ్రంకెన్ డ్రైవ్
- చర్యలు తీసుకున్న కామారెడ్డి ఎస్పీ

కామారెడ్డి క్రైం: మూడు రోజుల వ్యవధిలో నిజాంసాగర్ ఠాణాలో పని చేస్తున్న మరో కానిస్టేబుల్ సస్పెన్షన్‌కు గురయ్యాడు. ఎలాంటి అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు కావడమే కాకుండా అతిగా మద్యం సేవించి పోలీసులకు పట్టుబడిన వ్యవహారంలో ఓ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ ఎస్పీ రాజేశ్ చంద్ర శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలిలా ఉన్నాయి. నిజాంసాగర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్.రాకేష్ గౌడ్ అనే కానిస్టేబుల్ ఈనెల 5న అనుమతి లేకుండా విధులకు డుమ్మా కొట్టాడు. అతిగా మద్యం సేవించి కారు నడిపిస్తూ కామారెడ్డి వైపు వస్తుండగా.. తాడ్వాయి మండలం ఎర్రాపహాడ్ సమీపంలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. తాడ్వాయి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కానిస్టేబుల్ రాకేష్ గౌడ్ మద్యం మత్తులో ఉన్నట్లు గుర్తించారు. డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష చేసి ఉన్నతాధికారులకు నివేదించారు. దీంతో ఎస్పీ రాజేశ్ చంద్ర అతడిపై సస్పెన్షన్ వేటు వేశారు. క్రమశిక్షణ తప్పితే ఉపేక్షించేది లేదని ఎస్పీ పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యం కారణంగా రెండు రోజుల క్రితం ఇదే పీఎస్‌కు చెందిన కానిస్టేబుల్ మోహన్ సింగ్ సస్పెన్షన్‌కు గురైన విషయం తెలిసిందే.

బాలానగర్‌లో వివాహిత ఆత్మహత్య



అక్షయ (ఫైల్)

జక్రాన్‌పల్లి: మండలంలోని బాలానగర్‌లో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన గుంజ వెంకట్ తన కూతురు గుంజ అక్షయ (19)కు నెల క్రితం నిజామాబాద్ రూరల్ మండలంలోని నాగారం గ్రామానికి చెందిన పల్లపు సునీల్ అనే వ్యక్తితో వివాహం జరిపించాడు. కొన్ని రోజులుగా తనను భర్త శారీరకంగా వేధిస్తున్నాడంటూ అక్షయ రెండు రోజుల క్రితం పుట్టింటికి వచ్చింది. కాగా శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో అక్షయ సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు భర్త సునీల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మాలిక్ తెలిపారు.

మాక్లూర్‌లో యువకుడు..



శ్రీకాంత్ మృతదేహం

మాక్లూర్: మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా.. మండల కేంద్రానికి చెందిన రాచర్ల శ్రీకాంత్(29) కోత మిషన్‌పై డ్రైవర్‌గా పని చేస్తూ, జీవనం సాగించేవాడు. గురువారం రాత్రి తన పెళ్లి విషయమై తల్లిదండ్రులతో చర్చించాడు. ప్రస్తుతం వివాహం జరిపించడం కష్టమంటూ తల్లిదండ్రులు తేల్చిచెప్పడంతో అతడు ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. శుక్రవారం స్థానిక చెరువులో అతడు శవమై తేలడంతో పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని వెలికి తీసి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..

బీబీపేట: ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాలు ఇలా.. మండలంలోని ఇస్సానగర్ గ్రామానికి చెందిన సంగెపు స్వామి (45) అప్పుల బాధ భరించలేక ఈ నెల 4న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి అతడిని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి తల్లి రాజవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు.

చేపల వేటకు వెళ్లి జాలరి మృతి

రెంజల్ (బోధన్): చేపల వేటకు వెళ్లిన జాలరి వలకు చిక్కుకొని ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. వివరాలు ఇలా.. మండలంలోని కూనేపల్లికి చెందిన పాముల సాయిలు (50) అనే వ్యక్తి శుక్రవారం స్థానిక చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు వలకు చిక్కుకొని, నీటిలో పడి చనిపోయాడు. మృతుడి భార్య ఫిర్యా దు మేరకు కేసు న మోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నాన్‌బెయిలబుల్ వారెంట్ నిందితుడి పట్టివేత

ఖలీల్‌వాడి: పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న ఓ వ్యక్తి పోలీసులకు చిక్కకుండ తిరుగుతుండగా, అతడిపై నాన్‌బెయిలబుల్ వారెంట్ ఇష్యూ కాగా శుక్రవారం పట్టుకున్నట్లు సీపీ పోతరాజు సాయిచైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు ఇలా.. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా దేగ్లూర్ తాలూకాలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన బబ్లు బాలాజీ గైక్వాడ్ అలియాస్ ధన్ల బాబు (47) కొన్ని సంవత్సరాలుగా కామారెడ్డి జిల్లాలో పలు నేరాలకు పాల్పడ్డాడు. ఇతడిపై 24 వారెంట్లు ఇష్యూ కాగా, పోలీసులు ఎంత గాలించినా ఆచూకీ లభించలేదు. నగరంలో అతడు సంచరిస్తున్నట్లు సీపీకి విశ్వసనీయ సమాచారం రావడంతో సీసీఎస్ పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు సీసీఎస్ పోలీసులు నిందితుడిని పట్టుకుని కామారెడ్డి పోలీసులకు అప్పగించారు. సీసీఎస్ బృందాన్ని సీపీ సాయిచైతన్య అభినందించారు.

సైబర్ మోసం కేసులో ఒకరి అరెస్టు

ఖలీల్‌వాడి: ఇన్‌వెస్ట్‌మెంట్ పేరు మీద సైబర్ మోసానికి పాల్పడిన ఒకరిని అరెస్ట్ చేసినట్లు నిజామాబాద్ సైబర్ క్రైమ్ ఏసీపీ వెంకటేశ్వర్ రావు శుక్రవారం తెలిపారు. జిల్లాకు చెందిన శ్రావణ్ కుమార్‌ను ఇటీవల మహారాష్ట్రకు చెందిన పాండురంగ్ సుభాష్ మహాపంకర్ ఇన్‌వెస్ట్‌మెంట్ పేరు మీద రూ.31,36,900 వసూలు చేసి సైబర్ మోసానికి పాల్పడ్డాడు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. సదరు మోసగాడిపై దేశవ్యాప్తంగా 38 కేసులు నమోదయ్యానని పోలీసులు తెలిపారు. అతడి ఆచూకీ గుర్తించి, సీసీపీఎస్ సీఐ ముఖీద్ పాషా, సిబ్బంది సురేష్, నాగభూషణం, ప్రవీణ్, నరేష్ ఈ నెల 1న మహారాష్ట్రకు వెళ్లగా, గురువారం అరెస్ట్ చేశారు. అక్కడి కోర్టులో హాజరు పరిచి, శుక్రవారం రిమాండ్ నిమిత్తం నిజామాబాద్‌కు తీసుకుచ్చి కోర్టులో హాజరుపర్చారు. కోర్టు అతడికి 14 రోజుల రిమాండ్ విధించగా నిజామాబాద్ జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

అట్రాసిటీ కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలు

నిజామాబాద్ లీగల్: అప్పుగా ఇచ్చిన డబ్బులను తిగిరి ఇవ్వమని అడిగిన వ్యక్తిని బెదిరించి, కులం పేరుతో దూషించడంతో ఇద్దరికి నిజామాబాద్ ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి శ్రీనివాస్ ఐదేళ్ల జైలు శిక్ష, విధించారు. వివరాలు ఇలా.. ఆర్మూర్ మండలం పెర్కిట్‌కు చెందిన మేకల సురేష్ నుంచి 2016లో పెద్దపల్లి జిల్లా జూలపల్లికి చెందిన గొంగ్ల భవాని, చొప్పదండి మండలం రేపల్లి గ్రామానికి చెందిన వెంకటయ్యలు రూ. 50లక్షలు అప్పుగా తీసుకుని ప్రామిసరి నోట్ రాసిచ్చారు. నెలలు గడుస్తున్నా వారు డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో 2018 జూలై 2న సురేష్ వారికి నోటీసులు పంపారు. దీంతో వెంకటయ్య, భవానీలు 2018 నవంబర్ 25న పెర్కిట్ బస్టాండ్ వద్ద సురేష్‌పై దాడి చేసి, కులం పేరుతో దూషించారు. వెంటనే బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు నిందితులను పట్టుకొని కోర్టులో హాజరుపర్చారు. విచారణ అనంతరం శుక్రవారం నిందితులకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.4వేల జరిమానా విధిస్తు జడ్జి తీర్పు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు.